చిన్నకథ

# మానవ సంబంధాలన్నీ....

-అగ్ని



1988వ సంవత్సరం....

''బావా! నువ్వు లేకుండా నేను బ్రతకలేను. మా ఇంట్లో వాళ్లు మా అమ్మ తమ్ముడికి అదే మా మావయ్య కిచ్చి పెళ్ళి చేయాలంటున్నారు. తొందరగా ఏదో ఒకటి తేల్చు'' కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతుండగా చెప్పింది రమ్య.

ఆమె చెప్పింది వినగానే గుండెల్లో రాయిపడినట్టయింది కిషోర్‌కి. 'నువ్వు లేకుంటే నేను కూడా బ్రతకలేను' అని చెప్పాలనుకున్నాడు కానీ బాధతో నోట మాట రాలేదు.

రమ్యకి దూరపు బంధువు, వరసకి బావ అవుతాడు కిషోర్. రమ్య కుటుంబం పేదది. కిషోర్ వాళ్ళది కాస్తంత కలిగిన కుటుంబం. ఇరువైపుల పెద్ద అభ్యంతరాలేమీ లేవుగానీ మధ్యలో పానకంలో పుడకలా రమ్య మామయ్య ఈ అమ్మాయిని రెండో పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నించ సాగడం ఇబ్బందికరంగా తయారైంది. రమ్య తల్లి భార్య చనిపోయిన తమ్ముని కిచ్చి చేస్తే బాగా దగ్గరి సంబంధం కాబట్టి అంతా బాగా వుంటుందని, తమ్ముడికి వున్న స్వంత ఇల్లు, పొలం తన కూతురు స్వంతం అవుతుందని ఆలోచిస్తూ వుంది.

కిషోర్ ఏమీ మాట్లాడకపోయే సరికి రమ్య అతన్ని గట్టిగా తట్టి ''నేను చెప్పింది అర్థం అవుతుందా?'' అని అడిగింది.

కిషోర్ మౌనంగా తలూపాడు.

వారు ఏకాంతంగా కలుసుకునే స్థావరం ఊరి చివర వున్న రావిచెట్టు. ప్రస్తుతం వారిద్దరు అక్కడే వున్నారు. రమ్య అతని ఒళ్ళో తలపెట్టుకొని పడుకుంది. ''నీ ఒళ్ళో ఇలాగే తల పెట్టుకుని చనిపోవాలి బావా ఎప్పటికైనా. ఇదే నా కోరిక' అంది కళ్ళు మూసుకుని.

కిషోర్ తలవంచి ఆమె తడి కన్నులపై సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు. ''ఈ రోజే మా అమ్మా నాన్నలతో మాట్లాడి మీ ఇంటికి పంపిస్తాను. సరేనా!'' అన్నాడు.

రమ్య ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

కిషోర్ చెప్పిన విధంగానే అతని అమ్మానాన్నలు రెండ్రోజుల్లో రమ్య తల్లిదండ్రులతో పెళ్ళి విషయం ప్రస్తావించారు.

కొంత తర్జనభర్జన తర్వాత వారు పెళ్ళికి ఒప్పుకున్నారు. కానీ, కట్నంగా ఇవ్వడానికి తమ దగ్గర ఏమీ లేదని చెప్పారు. దాన్ని కిషోర్ తల్లిదండ్రులు పట్టించుకోలేదు. వారు కొంత విశాల భావాలు కలవారు.

పెళ్ళి ఉన్నంతలో బాగా జరిగింది.

కిషోర్ రమ్యను పువ్వుల్లో పెట్టి చూసుకోకపోయినా వున్నంతలో బాగానే చూసుకున్నాడు. సంసా రం పెరిగింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. కిషోర్ ఒక ప్రైవేట్ ఉద్యోగంలో స్థిరపడ్డాడు. కానీ వచ్చే జీతం సరిపోవడం లేదు. కాస్తో కూస్తో వున్న ఆస్థి. అతని ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళికి సరిపోయింది. అత్తగారి వైపు నుండి ఆదుకునే హస్తం లేదు. రమ్యకి ఇద్దరు అన్నలు వున్నప్పటికీ ఏ రోజూ చెల్లెల్ని, బావను పట్టించుకున్న పాపాన పోలేదు.

క్రమేణా అప్పులు పెరిగాయి. బాధలెన్ని వున్నా వున్నంతలో సర్దుకుపోతూ సరదాగా వుండ డానికి ప్రయత్నించే వాడు కిషోర్. కానీ రమ్య ఎదురింటి వాళ్ళతో, పక్కింటి వాళ్లతో పోల్చుకుని బాధ పడేది. వారికున్న నగలు, సామాన్లు తమకు లేవని కిషోర్ అసమర్థతను తిట్టిపోసేది. ఇతన్ని చేసుకుని తన జీవితం అన్యాయమైపోయిందని శాపనార్థాలు పెట్టేది.

కిషోర్ ఎన్ని మాటలన్నా సహించే వాడు కానీ ఆమె బ్రతుకు తన వల్ల అన్యాయమై పోయిందని అంటే మాత్రం ఊరుకో లేక పోయేవాడు.

''నిన్ను పైసా కట్నం తీసుకోకుండా చేసుకోవడం నా తప్పే'' అనేవాడు. ఈ మాటతో ఆమె మరింత రెచ్చిపోయేది.

''నువ్వు కాకపోతే నాకు తగినవాడు ఇంకొకడు వచ్చి వుండే వాడు. నిన్ను చేసుకోవడం వల్ల నాకు ఒరిగిందేమిటి?'' అనేది.

''అంటే ఏం ఆశించి నువ్వు పెళ్ళి చేసుకున్నావు నన్ను?'' అడిగేవాడు కిషోర్.

''ఏమీ ఆశించలేదు. అందర్లాగే బతకాలనుకున్నాను. కానీ నువ్వు ఇంత చేతకాని వాడివనుకోలేదు''.

''నా పరిధిలో నేను కష్టపడుతూనే వున్నానుగా. కాలం కలిసి రాలేదు. ఇంకొన్ని రోజులు పోనీ. మనకి మంచిరోజులు వస్తాయి. మనమూ బంగారం, వస్తువులు కొనవచ్చు. పెద్ద ఇల్లు కట్టు కోవచ్చు''.

''ఇవన్నీ ఈ జన్మకి తీరేటట్టు లేవు. వచ్చే జన్మలోనైనా డబ్బున్నోళ్ళ ఇంట్లో పుట్టేట్టు చెయ్యి దేవుడా''

''ఇంత నిరాశ ఎందుకు?''

''నిరాశ కాక ఇంకేమిటి? ఇప్పటికే తల నెరిసిపోతోంది. ఇంక నువ్వు సంపాదించేదేమిటి?''

''నేను సంపాదించలేనని అర్థమైంది కదా! మరి నువ్వు సంపాదించు''

''నేను సంపాదిస్తే ఇంక నువ్వెందుకు?''

''నేను సంపాదించేది చాలడం లేదు కదా! నువ్వు ఎంత సంపాదిస్తావో చూస్తాను''

''ఈ ఇంట్లో చాకిరి బయట చేస్తే ఎంతయినా సంపాదించవచ్చు.''

''ఇళ్ళలో చాకిరి చేస్తే మూడు పూటలా భోజనం మాత్రమే దొరుకుతుంది. నీకు బంగారం, నగలు కావాలంటే నువ్వు వ్యాపారం చెయ్యాలి''.

''ఏం వ్యాపారం?''

''ఏ వ్యాపారం చెయ్యాలన్నా పెట్టుబడి కావాలి. పెట్టుబడి లేకుండా చెయ్యాలంటే ఒకే ఒక వ్యాపారం వుంది''.

''అదే, ఏం వ్యాపారం అని?''

''శరీరం అమ్ముకునే వ్యాపారం. వ్యభిచారం''.

''ఏయ్! ఏం మాట్లాడుతున్నావ్. నేను నీకు ఒళ్ళమ్ముకుని బ్రతికే దానిలా కనిపిస్తున్నానా?''

''నువ్వు సర్దుకుని బ్రతకలేని రోజున చెయ్యడానికి వీలైన పని అదే!''

''నువ్వు ఇంక ఒక్క మాట ఎక్కువగా మాట్లాడితే నీ తల బ్రద్దలు కొడతాను''

''ఒకప్పుడు నా వళ్ళో తలపెట్టుకొని చచ్చిపోవాలన్నావ్. ఇప్పుడు నా తలబ్రద్దలు కొడతా నంటున్నావ్. ఎక్కడ వచ్చింది తేడా?''

అది 2009వ సంవత్సరం...

సమాధానం ఆమె దగ్గర లేదు.

కారల్‌మార్క్స్ దగ్గర వుంది. ఆయన ఏనాడో చెప్పాడు 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక నిర్మితాలని'.

ఈ భార్యాభర్తల వాదనకి అంతం లేదు ఆర్థిక విజయం సాధించేటంత వరకు.

*